9

సాక్షి
మంచిర్యాల

సోమవారం । 22 । సెప్టెంబర్ । 2025

గరిష్ఠం/కనిష్ఠం
31.5 /26.1
వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. అల్పపీడనం ప్రభావంతో చాలాచోట్ల మోస్తరు వానలు కురిసే అవకాశం ఉంది.


జిల్లా కేంద్రంలోని విశ్వనాథ ఆలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


విశ్వనాథ ఆలయానికి బతుకమ్మతో వస్తున్న మహిళ

ఎంగిలిపూల బతుకమ్మ సందడి

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ ఆదివారం ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మహిళలు, యువతులు పాటలు పాడుతూ రాత్రి వరకు ఆనందోత్సాహాల నడుమ బతుకమ్మ ఆడారు. జిల్లా కేంద్రంలోని విశ్వనాథ ఆలయం, హైటెక్‌సిటీ కాలనీ, రెడ్డి కాలనీ, ఆదిత్య ఎన్‌క్లేవ్, పాతమంచిర్యాల, హమాలివాడ, చున్నంబట్టివాడ, లక్ష్మీనగర్, రాంనగర్, జన్మభూమినగర్ కాలనీల్లో మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

– మంచిర్యాలటౌన్

- వివరాలు 11లో▸

న్యూస్‌రీల్

ఏజీపీగా సంతోష్


బానోత్ సంతోష్

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా జన్నారం మండలం హాస్టల్ తండాకు చెందిన బానోత్ సంతోష్‌ను నియమిస్తూ హైదరాబాద్ లా సెక్రెటరీ నుంచి ఆదివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. గత కొన్ని సంవత్సరాలుగా స్థానిక కోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వహిస్తూ పలువురికి సేవా కార్యక్రమాలు చేపడుతున్నందుకు ఏజీపీగా నియమించినట్లు సంతోష్ పేర్కొన్నారు. స్థానిక న్యాయవాదులు, పలువురు అభినందించారు.

యూరియా పంపిణీ చేయాలని రైతుల ధర్నా


జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

చెన్నూర్‌రూరల్: యూరియా బస్తాలు సకాలంలో అందించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కోటపల్లి మండలంలోని కొల్లూరు వద్ద చెన్నూర్-మహారాష్ట్ర జాతీయ రహదారిపై రైతులు ధర్నాకు దిగారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సరిగా యూరియా పంపిణీ చేయకపోవడంతో పండుగ పూట రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేసే పరిస్థితి తీసుకువచ్చిందన్నారు. సకాలంలో యూరియా అందించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు.


మహా బతుకమ్మ వేడుకలు విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నవీన్‌చారి

నస్పూర్: తెలంగాణ జాగృతి, హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో ఈనెల 23న సాయంత్రం శ్రీరాంపూర్‌లోని ప్రగతి స్టేడియంలో నిర్వహించనున్న మహా బతుకమ్మ వేడుకలను విజయవంతం చేయాలని తెలంగాణ జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్‌చారి కోరారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేడుకలకు తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హాజరు కానున్నట్లు తెలిపారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో కామారెడ్డి జాగృతి జిల్లా కన్వీనర్ సంపత్‌గౌడ్, సింగరేణి విభాగం అధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు ఐద ప్రశాంత్, రత్నాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌గౌడ్, మేడి శేఖర్, బొగ్గుల సాయికృష్ణ, వంశీ, ఈట రాకేశ్, వినయ్ పాల్గొన్నారు.

జాతీయ మహాసభలకు జిల్లా నేతలు


మహాసభలకు హాజరైన సీపీఐ జిల్లా నేతలు

శ్రీరాంపూర్: పంజాబ్ రాష్ట్రంలోని ఛండీగఢ్‌లో ఈ నెల 21 నుంచి 26 వరకు జరుగుతున్న సీపీఐ జాతీయ మహాసభలకు జిల్లాకు చెందిన పలువురు ముఖ్య నేతలు హాజరయ్యారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, జిల్లా సమితి సభ్యులు రేగుంట చంద్రశేఖర్, మేకల దాసు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న సమస్యలను కూడా సభలో ప్రస్తావిస్తామని నేతలు తెలిపారు.

రాష్ట్ర కమిటీ సభ్యుడిగా చందు


బొడెంకి చందు

చెన్నూర్: తెలంగాణ రైతు సంఘం (ఏఐకేఏస్) రాష్ట్ర కమిటీ సభ్యుడిగా బొడెంకి చందు నియామకమయ్యారు. ఆదివారం హన్మకొండలో నిర్వహించిన తెలంగాణ యువ రైతు సంఘం శిక్షణ తరగతుల్లో మంచిర్యాల జిల్లా చెన్నూర్ రైతు సంఘానికి ప్రాతినిధ్యం వహిస్తున్న చందును నియమించినట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు పీహెచ్‌సీ భవనం ప్రారంభించనున్న మంత్రి

భీమారం: మండల కేంద్రంలో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని సోమవారం సాయంత్రం 3 గంటలకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు జైపూర్ మెడికల్ ఆఫీసర్ ముస్తాఫా తెలిపారు. ఈ కార్యక్రమానికి నాయకులు, ప్రజలు అధికసంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

జీజీహెచ్‌కు సుస్తీ..!



మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

- కీలక విభాగాల్లో వైద్యుల పోస్టులు ఖాళీ
- రోగులకు అరకొర సేవలు
- మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉన్నా భర్తీ కాని వైనం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లోని కీలక వైద్య పోస్టులు ఖాళీగా ఉండడంతో ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందడం లేదు. ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అనుబంధంగా కొనసాగుతున్న ఆస్పత్రిలో పలు ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉండడంతో ఆయా వైద్య సేవలపై ప్రభావం చూపిస్తోంది. మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలతో పాటు మహారాష్ట్రకు చెందిన రోగులు చికిత్సకోసం ఇదే ఆస్పత్రికి వస్తుంటారు. పలు విభాగాల్లో వైద్యసేవలు అందక పోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ విద్యార్థులకు బోధించేందుకు ప్రొఫెసర్లు తప్పనిసరిగా ఉండడంతో పాటు జనరల్ ఆస్పత్రిలో వైద్యసేవలు అందించాల్సి ఉంటుంది. ఆయా పోస్టులు ఖాళీగా ఉండడంతో అందుకు సంబంధించిన విభాగాల్లో ఎంబీబీఎస్ విద్యార్థులకు బోధన, ఆస్పత్రికి వచ్చిన రోగులకు వైద్య సేవలు అందడం లేదు.

ఓపీ సేవలకే పరిమితం

మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరడంతో పాటు, పూర్తిస్థాయి సౌకర్యాలు లేకపోవడం, వర్షాలకు స్లాబ్ పెచ్చులూడిపోయి భయానకంగా మారడంతో పూర్తిస్థాయిలో ప్రజలకు వైద్యసేవలు అందించలేకపోతున్నారు. శస్త్ర చికిత్సలు చేసేందుకు ఒకే ఒక ఆపరేషన్ థియేటర్ ఉండగా ఆర్థో విభాగానికి సంబంధించినవి మాత్రమే ఆపరేషన్లు చేస్తున్నారు. కంటి ఆపరేషన్లు చేసేందుకు అనుకూలంగా లేకపోవడంతో ఇన్‌ఫెక్షన్లు జరిగే ప్రమాదం ఉందని కంటికి సంబంధించిన శస్త్ర చికిత్సలు చేపట్టడం లేదు. వీటితో పాటు ఇతరాత్ర విభాగాలకు చెందిన శస్త్ర చికిత్సలు సైతం చేసేందుకు తగిన సౌకర్యాలు లేకపోవడంతో ఓపీకే పలు వైద్యసేవలు పరిమితం అవుతున్నాయి. ప్రస్తుతం కాలేజీరోడ్డులో ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆవరణలో నూతనంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను చేపడుతుండగా అది పూర్తయ్యేందుకు మరో ఆరు నెలలకు పైగా సమయం పట్టే అవకాశం ఉంది. నూతన భవనం పూర్తయితే అన్ని విభాగాలకు సంబంధించిన వైద్యసేవలు, శస్త్ర చికిత్సలు చేసేందుకు అవకాశం ఉండనుంది.

కీలక పోస్టులు ఖాళీ

ఇటీవల పలువురు జిల్లా వాసులు మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కిడ్నీ సంబంధిత నెఫ్రాలజిస్టు, యూరాలజీ వైద్యుల పోస్టులు ఖాళీగా ఉండడంతో డయాలసిస్‌తో పాటు ఇతరాత్ర వైద్యసేవలు అందడం లేదంటూ గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయా విభాగాలే కాకుండా కిడ్నీ, లంగ్స్ చికిత్సను అందించే పల్మనాలజీ విభాగంలో ఒక్క ప్రొఫెసర్ గానీ అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్‌గానీ లేకపోవడంతో ఆయా విభాగం ఖాళీగా ఉంది. దీనికి సంబంధించిన రోగులు జీజీహెచ్‌కు వస్తే కనీసం పరీక్షించే వారు లేకపోవడంతో, ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. ఆర్థోపెడిక్ విభాగంలో ప్రొఫెసర్‌తో పాటు 3 అసిస్టెంట్, 1 అసోసియేట్ పోస్టులు ఖాళీగా ఉండగా గైనకాలజిస్టు విభాగంలో 5 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు, చిన్న పిల్లల వైద్యుల్లో 2 అసోసియేట్, 4 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు, అనస్తీషియా విభాగంలో 1 అసోసియేట్ ప్రొఫెసర్, 4 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటితో పాటు రెండు స్టాఫ్‌నర్సు పోస్టులు, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. ఉన్న వైద్యులతోనే ఓపీ సేవలతో పాటు ఇతరాత్ర వైద్యసేవలు అందిస్తున్నారు.

నూతన భవనం వినియోగంలోకి వచ్చేలోపు ఖాళీగా ఉన్న పోస్టులన్నింటినీ భర్తీ చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటే మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రజలకు పూర్తిస్థాయి వైద్యం అందేందుకు అవకాశం ఉంటుంది.

మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఖాళీల వివరాలు

విభాగం	ఖాళీ పోస్టులు
ఆర్థోవిభాగం	1 ప్రొఫెసర్, 3 అసిస్టెంట్ ప్రొఫెసర్, 1 అసోసియేట్ ప్రొఫెసర్
పల్మనాలజీ	1 ప్రొఫెసర్, 2 అసిస్టెంట్ ప్రొఫెసర్, 1 అసోసియేట్ ప్రొఫెసర్
గైనకాలజీ	5 అసిస్టెంట్ ప్రొఫెసర్
ఈఎన్‌టీ	1 అసోసియేట్ ప్రొఫెసర్
పీడియాట్రీషియన్	2 అసోసియేట్ ప్రొఫెసర్, 4 అసిస్టెంట్ ప్రొఫెసర్
అనిస్తీషియా	1 అసోసియేట్ ప్రొఫసర్, 4 అసిస్టెంట్ ప్రొఫెసర్
నెఫ్రాలజిస్టు	ఖాళీ
యూరాలజిస్టు	ఖాళీ

భర్తీకోసం నివేదించాం



మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని పలు విభాగాల్లో ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ల పోస్టులతో పాటు, స్టాఫ్‌నర్సు, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటి భర్తీకోసం ప్రభుత్వానికి నివేదించాం. అందుబాటులో ఉన్న వైద్యులు ప్రస్తుతం ఆస్పత్రిలో ఉన్న సదుపాయాలను వినియోగించుకుని రోగులకు పూర్తిస్థాయిలో వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నారు.

– డాక్టర్ హరీశ్‌చంద్రరెడ్డి, మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్

నా‘నో’

- యూరియాపై జిల్లా రైతుల ఆసక్తి..
- బస్తాల కోసం బారులు తీరుతున్న వైనం..
- అవగాహన కల్పిస్తున్నా అంతే..


దండేపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఏవో(ఫైల్)

దండేపల్లి: నానో యూరియా వాడకాన్ని పెంచేందుకు వ్యవసాయ శాఖ అధికారులు రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నా ససేమిరా అంటున్నారు. ఘన రూప యూరియా కోసం గంటల తరబడి క్యూలో వేచి ఉంటున్నారే తప్పా ద్రవ రూప నానో యూరియాపై మాత్రం ఆసక్తి చూపడం లేదు. నానో యూరియా వినియోగం పెంచాలని ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలు కూడా ఫలించడం లేదు. ప్రస్తుత వానాకాలంలో మంచిర్యాల జిల్లాకు 16 వేల లీటర్ల నానో యూరియా బాటిళ్ల సరఫరా చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ధర కూడా తక్కువే..

సాధారణ యూరియా బస్తా ధర రూ.266 వరకు ఉంది. తరలింపునకు అదనంగా మరో రూ.50 వరకు చెల్లించాల్సి వస్తుంది. అదే అర లీటరు నానో యూరియా బాటిల్ రూ.225 నుంచి రూ.240 వరకు లభిస్తుంది. అర లీటరు నానో యూరియా 45 కిలోల యూరియా బస్తాతో సమానం. అంతే కాకుండా నానో యూరియా వాడకంతో 8 శాతం పంట దిగుబడి అధికంగా వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. నానో యూరియాను నిల్వ చేయడం, తీసుకెళ్లడం సులువే. బస్తాలైతే ప్రస్తుతం గంటల తరబడి క్యూలో నిలబడాల్సిందే. నిల్వ చేయడం, తీసుకెళ్లడం కూడా ఇబ్బందే.

ప్రయోజనాలు ఎక్కువే..

ఘన రూప యూరియా, డీఏపీ మొక్క మొదలుకు అందిస్తారు. దీంతో సగం నేలలోనే కలిసి పోతుంది. పంటకు అందేది కొంచమే. మరోవైపు భూమి సైతం సారాన్ని కోల్పోతుంది. మిత్ర పురుగులు చనిపోతాయి. నానో యూరియాతో ఆ ఇబ్బంది ఉండదు. పిచికారీ చేయడంతో ఆకుల ద్వారా 85 శాతం వరకు నేరుగా మొక్కకు చేరుతుంది. నత్రజనిని సులభంగా చేరవేయవచ్చు. పంటలకు, పర్యావరణానికి అనేక లాభాలు ఉన్నాయి. తక్కువ మోతాదులో ఎక్కువ ప్రభావం ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లాలో వానాకాలం సాగుకు యూరియా వినియోగం (మెట్రిక్ టన్నుల్లో)

అవసరం	ఇప్పటివరకు వచ్చింది	రావాల్సింది
28,575	23,250	5,325

జిల్లాలో వానాకాలం సాగు వివరాలు

పంట	ఎకరాలు
వరి	1,55,571
పత్తి	1,61,193
మొక్కజొన్న	267
కంది	927

అవగాన కల్పిస్తున్నాం..

నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రయోజనాలను గురించి వివరిస్తున్నాం. అయినా ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం యూరియా బస్తాలతో పాటుగా నానో యూరియాను కూడా రైతులకు అందుబాటులో ఉంచాం.

– సురేఖ, జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయాధికారి

రక్తదానానికి ప్రజలు ముందుకురావాలి

- కలెక్టర్ కుమార్ దీపక్


ధృవీకరణ పత్రాలు అందిస్తున్న కలెక్టర్

మంచిర్యాలటౌన్: అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారిని ఆదుకునేందుకు ప్రజలు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు జన్మదినం పురస్కరించుకుని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో ఆదివారం జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్‌హాల్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకు ద్వారా తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులతో పాటు, గర్భిణులకు ప్రసవ సమయంలో, రోడ్డు ప్రమాదాలకు గురైన వారికి ప్రతీరోజు దాదాపుగా 30 మందికి రక్తం అందించడం జరుగుతుందన్నారు. శిబిరంలో 1,101 మంది రక్తదానం చేయడం గొప్ప విషయమన్నారు. పోలీసు శాఖ సైతం ముందుకు వచ్చిందని, వారి ఆధ్వర్యంలోనూ మెగా శిబిరం నిర్వహిస్తామని, ఇతరులు సైతం రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రక్తదాతలకు ధృవీకరణ పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ అనిత, దేవాపూర్ అదాని ఓరియంట్ సిమెంట్ కంపెనీ యూనియన్ అధ్యక్షుడు కొక్కిరాల సత్యపాల్‌రావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

పాతమంచిర్యాల: రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని మానవ వికాస వేదిక కేంద్ర సహాయ కార్యదర్శి హన్మంత్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని చార్వక హాలులో ఆదివారం మనువాద అధ్యయన తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబాపూలే, పెరియార్ సేవలను కొనియాడారు. వారి త్యాగాల వల్లే బడుగు బలహీన వర్గాల ప్రజలు అభివృద్ధి చెందారన్నారు. సమాజంలో అమాయకులపై జరుగుతున్న హత్యలు, దాడులను అరికట్టాలన్నారు. సమావేశంలో మానవ వికాస వేదిక రాష్ట్ర అధ్యక్షుడు తమ్మ భాస్కర్, కేంద్ర నాయకులు సాంబశివరావు, గౌతం, పోచన్న, రంగు రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

అడవిలో చెట్లు నరకడం చట్టవిరుద్ధం


కౌన్సిలింగ్ ఫొటోలు చూపుతున్న ఎఫ్‌డీవో

జన్నారం: అడవిలోని చెట్లు నరకడం చట్టవిరుద్ధమని జన్నారం ఫారెస్ట్ డివిజనల్ అధికారి రామ్మోహన్ అన్నారు. ఆదివారం టీడీసీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కవ్వాల్ టైగర్‌జోన్ కోర్ ఏరియాలో పాలఘోరీల ప్రాంతంలో సర్వే నంబర్ 112లో ఉన్న 9,631 ఎకరాల్లో తమ పూర్వీకుల భూమి ఉందని కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ యూ, జైనూర్, లింగాపూర్ మండలాలకు చెందిన ఆదివాసీ గిరిజనులు గతనెల 4న గుడిసెలు వేసుకుని ఉంటున్నారన్నారు. ఇట్టి భూమిపై ఆదివాసీలు ఆర్డీవోకు దరఖాస్తు చేసుకోగా 2005 డిసెంబర్‌కు ముందు పోడులో ఉన్న వారి వివరాల ప్రకారం 120 ఎకరాలను పంచగా మిగతా భూమి ఫారెస్టులో కలిసిందని అధికారులు రాతపూర్వకంగా వారికి తెలియజేశారన్నారు. శాంతియుతంగా వారితో మాట్లాడటమే కాకుండా పోలీసు, రెవెన్యూ అధికారులతో పలు మార్లు కౌన్సిలింగ్ కూడా ఇప్పించామన్నారు. అయినా వారిలో మార్పు రాకపోవడమే కాకుండా ఈనెల 18న రూ.3.50 లక్షల విలువైన 350 టేకుచెట్లను నరికారని, అడ్డుగా వెళ్లిన అటవీ సిబ్బందిపై కారంపొడి చల్లి కర్రలతో దాడికి పాల్పడ్డారన్నారు. వారి పై అటవీ నేరం, వన్యప్రాణుల చట్టం ప్రకారం కేసులు నమోదు చేశామన్నారు. అటవీ సిబ్బందిపై దాడికి పాల్పడిన 26 మందిని అరెస్ట్ చేసి ఆదివారం తెల్లవారుజామున లక్సెట్టిపేట కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి వారికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎఫ్‌డీవో పేర్కొన్నారు. సమావేశంలో రేంజ్ అధికారి సుష్మారావు, సిబ్బంది పాల్గొన్నారు.

మారిన రోడ్డు విస్తరణ ప్రణాళిక?

- 60 ఫీట్లా...40 ఫీట్లా..?
- కుదించినట్లు ప్రచారం..
- నేతలు చక్రం తిప్పారని అనుమానం


కుదించాలని యోచిస్తున్న బెల్లంపల్లి బస్తీ రోడ్డు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో ఓ ముఖ్యమైన అంతర్గత రోడ్డు వెడల్పు ప్లానింగ్ మారబోతోందా? ముఖ్యమైన మూడు ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ చేపట్టనున్నారు. వీటిలో రెండు ప్రాంతాల రోడ్లు యధాతథంగా వెడల్పు చేయనుండగా ఓరోడ్డును మాత్రం కుదించబోతున్నారా, ఇందుకు కొందరి అండదండలతో ప్లానింగ్ రిపోర్టు మార్చడానికి కుయుక్తులు పన్నుతున్నారా?.. వీటన్నింటికీ సమాధానం పురప్రజల నుంచి అవుననే వస్తోంది. ఈ విషయంలో ఇప్పటికే కొందరు రంగంలోకి దిగి పావులు కదిపి లైన్‌క్లియర్ చేసినట్లు ప్రచారం జరుగుతుండగా అందుకు తగినట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

తొలుత ప్రతిపాదించింది ఇలా...

మున్సిపాలిటీలో పెరుగుతున్న జనాభా, అవసరాల రీత్యా రోడ్ల విస్తరణ చేపట్టాలని కొన్నాళ్ల క్రితం తీర్మానించారు. రూ.8.94 కోట్ల అంచనాతో కాల్‌టెక్స్ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద నుంచి ఏఎంసీ మీదుగా అంబేడ్కర్ (కాంటా) చౌరస్తా వరకు 100 ఫీట్లతో, పాత బస్టాండ్ నుంచి శ్రీసరస్వతీ శిశుమందిర్ మీదుగా అంబేడ్కర్ నగర్ చౌరస్తా వరకు, అంబేడ్కర్ చౌరస్తా నుంచి బెల్లంపల్లి బస్తీ మీదుగా పోచమ్మగడ్డ చౌరస్తా వరకు 60 ఫీట్ల చొప్పున రోడ్లను వెడల్పు చేయనున్నట్లు ప్రతిపాదించారు. అయితే వీటిలో బెల్లంపల్లి బస్తీ నుంచి పోచమ్మగడ్డ చౌరస్తాకు వెళ్లే రోడ్డు మాత్రం 40 ఫీట్లతో నిర్మాణం చేయాలని తాజాగా సంకల్పించినట్లు ప్రచారం జరుగుతుండగా మిగతా రెండు ప్రాంతాల రోడ్లను తొలుత ప్రతిపాదించినట్లుగానే విస్తరించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

కుదించాల్సిన అవసరం ఎందుకో?

కాల్‌టెక్స్–అంబేడ్కర్ చౌరస్తా అంతర్గత ప్రధాన రహదారితో పాటు అంబేడ్కర్ చౌరస్తా నుంచి బెల్లంపల్లి బస్తీ మీదుగా పోచమ్మ గడ్డ చౌరస్తా వెళ్లే రోడ్డు ఎప్పుడు చూసినా రద్దీగా ఉంటాయి. వీటితో పోలిస్తే పాత బస్టాండ్–అంబేడ్కర్ నగర్ చౌరస్తా రోడ్డు కాస్తా తక్కువ రద్దీతో కనిపిస్తుంది. పురప్రజలకు ముఖ్యంగా వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆ మూడు రోడ్లను విస్తరించాలని నిర్ణయం తీసుకున్నారు. రోడ్డు వెడల్పు కోసం ప్రతిపాదిత ప్రాంతాల్లో మార్కింగ్ చేశారు. తాజాగా బెల్లంపల్లి బస్తీ మీదుగా పోచమ్మ గడ్డ చౌరస్తాకు వెళ్లే రోడ్డును 20 ఫీట్లు తగ్గించి 40 ఫీట్లతో వెడల్పు చేయనున్నారనే ప్రచారం జరుగుతుండడం పురప్రజలను తీవ్ర విస్మయానికి గురిచేస్తోంది.

హైదరాబాద్‌లో పావులు కదిపారా?

బెల్లంపల్లి గ్రామీణ ప్రాంతాలతో పాటు నెన్నెల, భీమిని, కన్నెపల్లి, వేమనపల్లి, దహేగాం, తదితర ప్రాంతాల ప్రజలు బెల్లంపల్లి బస్తీ రోడ్డు మీదుగా నిత్యం రాకపోకలు చేస్తుంటారు. అంతటి ప్రాధాన్యత కలిగిన రోడ్డును ఇటీవల కొందరు హైదరాబాద్ వెళ్లి కొందరితో సంప్రదింపులు జరిపిన తర్వాతే తగ్గించాలనే ప్రతిపాదనను తెరమీదకు తీసుకువచ్చినట్లు చర్చించుకుంటున్నారు.

హైకోర్టుకు బాధితులు

రోడ్ల వెడల్పుపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ బాధితులు హైకోర్టును ఆశ్రయిస్తున్నారు. పరిహారం చెల్లించలేదని ఒకరు, నిబంధనలు పాటించడంలేదని పలువురు కోర్టుకు వెళ్లడంతో రోడ్ల విస్తరణకు ప్రతిబంధకాలు ఏర్పడుతున్నాయి.

ఫైనల్ ప్లానింగ్ రిపోర్టు రాలేదు



బెల్లంపల్లి బస్తీ మీదుగా పోచమ్మగడ్డ చౌరస్తాకు వెళ్లే రోడ్డు వెడల్పుపై ఇంతవరకు ఆర్‌డీఎంఏ నుంచి ఫైనల్ ప్లానింగ్ రిపోర్టు రాలేదు. ఈ విషయంలో ఇంకా క్లారిటీ లేక తుదినిర్ణయం తీసుకోలేదు. ఇటీవలే ఇన్‌స్పెక్షన్ టీమ్ వచ్చి రోడ్లను పరిశీలించి వెళ్లింది. మున్సిపాలిటీ నుంచి ప్లాన్ కూడా పంపించాం. ఎన్ని ఫీట్ల వరకు రోడ్డు వెడల్పు చేయాలో నిర్ణయించి రిపోర్టు పంపిస్తారు. ఆ రిపోర్టుకోసం వేచి చూస్తున్నాం.

– తన్నీరు రమేశ్, మున్సిపల్ కమిషనర్

లాభాల వాటాపై నేడు సీఎం ప్రకటన!

శ్రీరాంపూర్: సింగరేణి 2024–25 ఆర్థిక సంవత్సరంలో సాధించిన లాభాల్లో నుంచి కార్మికులకు చెల్లించే వాటాపై సోమవారం ప్రకటించనున్నారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కంపెనీ లాభాలను ప్రకటించి కార్మికులు ఇచ్చే వాటాను డిక్లేర్ చేయనున్నారు. సింగరేణి సీఎండీతో పాటు రాష్ట్ర మంత్రులు, కోల్‌బెల్ట్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నేతలతో సమావేశం కానున్నారు. క్రితంసారి వచ్చిన రూ.2,412 కోట్ల లాభాల నుంచి 33 శాతం వాటాగా రూ.796 కోట్లు కార్మికులకు పంపిణీ చేశారు. ఈసారి సుమారు రూ.4 వేల కోట్ల లాభం వచ్చి ఉంటుందని, ఒక శాతం పెంచి ఇస్తారనే ప్రచారం జరుగుతోంది. వాస్తవ లాభాల్లో నుంచి భవిష్యత్ పెట్టుబడులు తీసి మిగిలిన మొత్తం లాభాలుగా చూపి అందులో నుంచే ఈ వాటా ప్రకటిస్తారనే ప్రచారం కూడా ఉంది.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ ఎస్పీఎం కార్మికుడి మృతి


భాస్కర్(ఫైల్)

కాగజ్‌నగర్‌టౌన్: ఎస్పీఎం పేపరు మిల్లులో ఫైబర్ లైన్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్న ఎన్నం భాస్కర్ (41)పై ఈ నెల 3న కెమికల్ పడడంతో తీవ్ర గాయాలు కాగా వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. 18 రోజులుగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి


తోఫిక్ (ఫైల్)

ఇచ్చోడ: మండలంలోని ముఖ రా(బి) గ్రామంలో శనివారం సాయంత్రం తోఫిక్ (22) అనే యువకుడు అనుమానాస్పదంగా బావిలో పడి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్సై పురుషోత్తం తెలిపిన వివరాల ప్రకారం.. తోఫిక్ అదే గ్రామానికి చెందిన కొంతమంది యువకులతో కలిసి శనివారం సాయంత్రం కాష్లే రాహుల్ వ్యవసాయ బావిలో ఈతకు వెళ్లారు. కొంత సేపటి తర్వాత స్నేహితులు బావిలో నుంచి పైకి రాగా తోఫిక్ మాత్రం బయటకు రాలేదు. వెంటనే గ్రామస్తులు బావి వద్దకు వెళ్లే సరికి తోఫిక్ బావిలో మృతి చెంది ఉన్నాడు. ఆదివారం ఉదయం పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీసి శవపంచానామా నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. మృతుడి తండ్రి రఫీక్ ఖాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సైబర్ వలలో యువకుడు

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల కాలంలో సైబర్ మోసాలు పెరిగిపోతున్నాయి. పోలీసులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ చాలా మంది అత్యాశతో ఉన్న డబ్బులు పోగొట్టుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్‌కు చెందిన ఓ యువకుడు సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్నాడు. రూ.లక్షా650 పోగొట్టుకొని లబోదిబోమంటున్నాడు. ఈనెల 19న ఇన్‌స్టాగామ్‌లో ధని లోన్‌యాప్ లింక్ రాగా బాధితుడు ఓపెన్ చేశాడు. రూ.5లక్షల రుణం తీసుకోవచ్చని,ఇందుకు ప్రాసెసింగ్ ఫీజు రూ.1800 చెల్లించాలని సైబర్ నేరగాళ్లు సూచించారు. నమ్మిన యువకుడు మొదట డబ్బులు చెల్లించాడు. ఆ తర్వాత బీమా పేరిట రూ.5వేలు, ఇలా పలురకాల ఫీజుల పేరిట ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించాడు. మొత్తం రూ.లక్షా650 చెల్లించాక మోసపోయినట్లు గ్రహించాడు. టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేయగా, సీఐ నాగరాజు కేసు నమోదు చేసినట్లు వివరించారు. బాధితులు 1930కు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

బ్యాటరీ దొంగలు అరెస్ట్


బ్యాటరీ దొంగలతో ఎస్సై లింబాద్రి

నిర్మల్‌టౌన్: బ్యాటరీ దొంగలను అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్సై లింబాద్రి ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్‌రూరల్ మండలం అక్కాపూర్ గ్రామానికి చెందిన తాండ్ర సాయన్న తన జేసీబీని గ్రామ శివారులో ఉంచి వెళ్లారు. పట్టణంలోని మంజులాపూర్‌కు చెందిన అఖిల్, మహాలక్ష్మివాడకు చెందిన నందకిషోర్‌లు జేసీబీలోని రెండు బ్యాటరీలను శనివారం రాత్రి దొంగిలించారు. విషయం తెలుసుకున్న జేసీబీ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని రెండు బ్యాటరీలను రికవరీ చేశారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఎక్స్‌పైరీ సరుకుల విక్రయం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని శ్రీమార్ట్‌లో గడువు ముగిసిన (ఎక్స్‌పైరీ) సరుకుల విక్రయాలు కలకలం సృష్టించాయి. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఆదివారం రాత్రి శ్రీమార్ట్ సూపర్‌మార్కెట్‌కు వెళ్లి మిల్కీ మిస్ట్‌లను కొనుగోలు చేశాడు. బిల్లు చెల్లించాక వస్తువులపై ఉన్న ఎక్స్‌పైరీ డేట్‌ను పరిశీలించగా ఈ నెల 4 గడువుగా ఉండడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై షాపు నిర్వాహకులను ప్రశ్నించగా సిబ్బంది నిర్లక్ష్యంగా అప్పుడప్పుడు ఇలా జరుగుతుంటాయని, మరోసారి జరగకుండా చూస్తామని సమాధానం ఇచ్చారు. దీంతో బాధితుడు జిల్లా ఫుడ్ సెఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశాడు.

యూరియా తరలించేదెలా..?


యూరియా బస్తాలు అన్‌లోడ్ చేస్తున్న రైతులు

వేమనపల్లి: మండలంలోని బమ్మెన, చామనపల్లి గ్రామాలకు చెందిన రైతులు యూరియా తరలించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మార్గమధ్యలోని గొలిమికుంట ఒర్రెపై కల్వర్టు అసంపూర్తిగా నిర్మించారు. యూరియా లోడ్‌తో ఉన్న ట్రాక్టర్ ట్రాలీ ఒర్రెలో ఆదివారం దిగపడింది. రైతులు బస్తాలను అన్‌లోడ్ చేసి ట్రాలీ బయటకు తీశారు. మళ్లీ లోడ్ చేసుకుని బమ్మెన గ్రామానికి తరలించారు.

శరణు.. శరణు దేవీ!


అమ్మవారి విగ్రహాలకు తుదిమెరుగులు దిద్దుతున్న కళాకారులు

- నేటి నుంచే శరన్నవరాత్రోత్సవాలు
- మండపాల్లో కొలువుదీరనున్న దుర్గమ్మ
- ఏర్పాట్లు పూర్తి చేసిన భక్తజనం
- 11 రోజులు.. 11 రూపాల్లో దర్శనం

ఆదిలాబాద్: అమ్మవారి ఆగమనానికి సర్వం సిద్ధమైంది. ఆది పరాశక్తిని నవరాత్రుల్లో కొలిచేందుకు భక్తులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మండపాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దేవి శరన్నవరాత్రి వేడుకలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో అమ్మవారి మూర్తులు తుదిరూపం దిద్దుకుంటున్నాయి.

శరన్నవరాత్రులు పేరెలా..?
ప్రతీ సంవత్సరం ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి మొదలు మహార్నవమి వరకు దేవీ నవరాత్రులు లేదా శరన్నవరాత్రులుగా పిలుస్తారు. ఈ మాసం నుంచి వర్ష ఋతువు వెళ్లి, శరత్ ఋతువు ప్రారంభమవుతుంది. దీంతో శరన్నవరాత్రులుగా వ్యవహరిస్తారు. ఈ ఋతువులో వర్షాకాలం ముగిసి చలికాలం ప్రారంభమవుతుంది. ఈ అశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి నవమి వరకు శక్తి ఆరాధన పేరుతో ప్రజలంతా పరిశుభ్రంగా ఉంటే ఎలాంటి అంటువ్యాధులు దరిచేరవని భక్తుల నమ్మకం.

11 రోజులు.. 11 రూపాలు
ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు రోజుకు ఒక్క రూపంలో దర్శనం ఇవ్వనున్నారు. మొదటిరోజు ఈనెల 22న బాల త్రిపుర సుందరి దేవిగా, 23న శ్రీ గాయత్రి దేవిగా, 24న శ్రీ అన్నపూర్ణ మాతగా 25న కాత్యాయనీ దేవిగా, 26న శ్రీ మహాలక్ష్మి దేవిగా, 27న శ్రీ లలిత త్రిపుర సుందరి దేవిగా, 28న శ్రీ మహా చండీ దేవిగా, 29న సరస్వతి దేవిగా, 30న దుర్గాదేవిగా దర్శనమిస్తారు. అక్టోబర్ 1న మహిషాసుర మర్దిని దేవి, 2న రాజరాజేశ్వర దేవిగా అమ్మవారు దర్శనమిస్తారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో..


శ్రీ కన్యకాపరమేశ్వరి శివపంచాయతన దేవాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన టెంట్లు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి శివపంచాయతన క్షేత్రంలో సోమవారం నుంచి అక్టోబర్ 2 వరకు దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు వేసి విద్యుద్దీపాలతో అలంకరించారు. మహాశక్తి రూపిని కన్యాకాపరమేశ్వరి దేవిని భక్తులు నమ్మకంతో కొలుస్తారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి
దేవీ శరన్నవరాత్రులకు ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఒక్కో రోజు ఒక్కో రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఆలయ ప్రాంగణంలో టెంట్లు, లైటింగ్ ఏర్పాట్లు చేశాం. అందరి సహకారంతో ఏటా అంగరంగ వైభవంగా శరనవరాత్రులను నిర్వహిస్తున్నాం.
– శంకరయ్య, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు

నాటి మహిషాపురం.. నేటి బైంసా పట్టణం..


గుట్టపై వెలిసిన గట్టు మైసమ్మ ఆలయం

బైంసా: ఒకప్పటి మహిషాపురమే నేడు బైంసా పట్టణంగా పిలుస్తున్నారు. చరిత్రను తెలిపే రాతితో చెక్కిన మహిషాపాదాలు బైంసాలో దర్శనమిస్తున్నాయి. ఈ ప్రాంతంలో ఉండే మహిషాసుర రాక్షసుడిని దుర్గాదేవి మహిషా అవతారంలో వధించిందని పురాణాలు చెబుతున్నాయి. సాక్షాత్తు దుర్గాదేవే ప్రజలను ఆదుకున్నందుకు అప్పటి వారు రాతితో పాదాలను చెక్కించారు. ఇందుకు గుర్తుగా సమీపంలోని గుట్టపై మైసమ్మ మందిరాన్ని నిర్మించారు. ఈ ఆలయంలో దుర్గాదేవి గట్టు మైసమ్మగా పూజలు అందుకుంటోంది. కాగా సోమవారం నుంచి బైంసా డివిజన్‌వ్యాప్తంగా భక్తులు దుర్గాదీక్షలు స్వీకరించనున్నారు.

ఇద్దరమ్మల పుణ్యక్షేత్రం


ఆలయంలో కొలువైన కనకదుర్గాదేవి, మహంకాళి అమ్మవారి విగ్రహాలు

రెబ్బెన: ఇందిరానగర్‌లోని కనకదుర్గాదేవి, స్వయంభూగా వెలిసిన మహంకాళి అమ్మవార్లు భక్తులు కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారంలా విరాజిల్లుతున్నారు. రెండో చంద్రపూర్‌గా పేరుగాంచిన ఈ ఆలయంలో నేటి నుంచి తొమ్మిది రోజుల పాటు శరన్నవరాత్రి ఉత్సవాలు జరుపనున్నారు.

అంగరంగ వైభవంగా ఉత్సవాలు..



ఆలయంలో అమ్మవారి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈసారి చవితి తిథి రెండు రోజుల్లో ఉండటంతో ఉత్సవాలను పది రాత్రుల పాటు నిర్వహిస్తున్నాం.
– దేవార వినోద్ స్వామి, ఆలయ ప్రధాన అర్చకుడు

అమ్మ కొలువుదీరే వేళాయె..!

నిర్మల్‌టౌన్: నిర్మల్ జిల్లా కేంద్రంలోని నందిగుండం దుర్గామాత ఆలయం, హరిహర క్షేత్రం, బంగల్ పేట్ మహాలక్ష్మి, బాగులవాడ ఆంజనేయస్వామి తదితర ఆలయాల్లో ఏటా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. అధిక సంఖ్యలో తరలివచ్చే భక్తుల కోసం అధికారులు, నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రత్యేకంగా మండపాలను ముస్తాబు చేశారు. మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలు, వివిధ రకాల పువ్వులతో అలంకరించారు.

నాలుగు దశాబ్దాలుగా బాగులవాడలో..
నిర్మల్‌లో నాలుగు దశాబ్దాలుగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బాగులవాడ కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయంలో 1981లో మొదటగా దుర్గామాత చిత్రపటం ఉంచి రెండేళ్లు పూజలు చేశారు. తర్వాత 1983లో రెండు ఫీట్ల కర్ర విగ్రహం, 1985 నుంచి ఇప్పటివరకు మట్టి విగ్రహాలు ప్రతిష్ఠించి చీరలు, ఆభరణాలతో అలంకరించి పూజలు నిర్వహిస్తున్నారు. బాగులవాడ కాలనీలో సుమారు 500 కుటుంబాల వారు తొమ్మిది రోజులు ఉపవాస దీక్షలు చేస్తారు.


నందిగుండం దుర్గామాత

ప్రసిద్ధిగాంచిన నందిగుండం దుర్గామాత..
పట్టణంలో 19 ఏళ్ల కిందట నందిగుండం ప్రాంతంలోని మర్రిచెట్టు వద్ద దుర్గామాత వెలిసింది. భక్తులు అప్పటి నుంచి దుర్గామాతకు పూజలు చేస్తున్నారు. గత 14 ఏళ్లుగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆరేళ్ల క్రితం రూ.1.80 కోట్లతో ఆలయం కూడా నిర్మించారు.

అష్టభుజ స్వామికి పదకొండు వాహనాలు..


స్వామి వారు ఊరేగనున్న వాహనాలు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని అత్యంత పురాతనమైన అష్టభుజ శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం దక్షిణ భారతదేశంలోనే అష్ట భుజాలు గల ఏకైక ఆలయం. శ్రీ వేణుగోపాలునికి ఎనిమిది చేతులు ఉంటాయి. ప్రతీ చేతిలో ఒక ఆయుధం ఉంటుంది. కత్తి, సుదర్శన చక్రం, విశ్వం, గదా, శంకు, పద్మం, రెండు పిల్లన గ్రోవీలు ఉన్నాయి. నవరాత్రుల్లో భాగంగా ప్రతీరోజు స్వామి వారు గ్రామంలోని రథంపై వివిధ వాహనాలపై ఊరేగుతారు. మొదటి రోజు సూర్య ప్రభ వాహనం, రెండో రోజు చంద్ర ప్రభ వాహనం, మూడో రోజు గజ వాహనం, నాలుగో రోజు అశ్వ వాహనం, ఐదో రోజు హంస వాహనం, ఆరో రోజు హనుమ వాహనం, ఏడో రోజు శేష వాహనం, ఎనిమిదో రోజు గరుడ వాహనం, తొమ్మిదో రోజు సింహ వాహనం, పదో రోజు పులి వాహనం, పదకొండో రోజు అశ్వం, గరుడ, హనుమ సహిత వాహనంపై స్వామివారిని ఊరేగిస్తారు.

కష్టాలు తొలగిపోతాయి..



శ్రీ వేణుగోపాల స్వామి వద్దకు వచ్చి భక్తితో కొలిచిన భక్తులకు కష్టాలు తొలగిపోయి వారికి అష్టఐశ్వర్యాలు ప్రసాదిస్తాడని ప్రగాఢ నమ్మకం ఉంది. నేటి నుంచి ప్రారంభమయ్యే రథోత్సవ కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామి వారి కృప పొందాలి.
– రవి కిరణ్, ఆలయ కమిటీ చైర్మన్


శ్రీవేణుగోపాల స్వామి ఆలయం

అలరించిన గుస్సాడీ నృత్యం


గుస్సాడీ నృత్యం చేస్తున్న బృందం

బాసర: ఆర్జీయూకేటీలో ఆదివాసీ సంప్రదాయ గుస్సాడీ నృత్య ప్రదర్శన విద్యార్థులు, అధ్యాపకులను ఎంతగానో ఆకట్టుకుంది. స్పిక్ మెకే హెరిటేజ్ క్లబ్ ఆధ్వర్యంలో కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన శ్రీ కనక సుదర్శన్ ఆదివాసీ బృందం ఈ నృత్య ప్రదర్శన చేశారు. వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ ఆధునిక కాలంలోనూ వారసత్వ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందిరిపై ఉందన్నారు. డిసెంబర్ 2 నుంచి 5 వరకు తెలంగాణ రాష్ట్ర 4వ స్పిక్ మెకే సాంస్కృతిక సమ్మేళనం యూనివర్సిటీలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అసోసియేట్ డీన్లు డా. మహేశ్, డా. విఠల్, స్పిక్ మేకే కోఆర్డినేటర్ డా. రాకేశ్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఇంజినీర్స్ డే వేడుకలు


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న వీసీ

బాసర: ఆర్జీయూకేటీలో నిర్వహిస్తున్న నేషనల్ ఇంజినీర్స్ డే వేడుకలు ఆదివారం ముగిశాయి. 2024 -25 విద్యాసంవత్సరానికి బ్రాంచ్‌ల వారీగా అకాడమిక్ టాపర్లకు మొట్టమొదటి సారిగా ప్రతిభా పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో విద్యార్థులు, అధ్యాపకుల నిబద్ధత, కృషిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ డాక్టర్ ఎస్.విఠల్, శ్రీ టి.పి.సునీల్ కుమార్, సీహోఈ శ్రీ రామరాజు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మృతదేహాన్ని చేతులపై మోసుకుంటూ..

- వాగు పొంగడంతో అంబులెన్స్ వెళ్లలేని పరిస్థితి
- కుటుంబ సభ్యులే తరలించిన వైనం


మృతదేహాన్ని వాగు దాటిస్తున్న కుటుంబ సభ్యులు

కెరమెరి: వర్షాలకు వాగులు ఉప్పొంగి జిల్లా ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. మృతదేహాన్ని అతికష్టం మీద వాగు దాటించిన ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని కరంజీవాడలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్న మండాడి కోసు(60) కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. శనివారం తీవ్ర అస్వస్థతకు గురై అపస్మారకస్థితికి చేరడంతో కుటుంబ సభ్యులు ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. ఆరోగ్యం విషమించి ఆదివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో మృతదేహంతో స్వగ్రామానికి బయల్దేరారు. మార్గమధ్యలోని అనార్‌పల్లి వాగు ఉప్పొంగడంతో అంబులెన్స్ వాగు దాటే అవకాశం లేకపోవడంతో మానవహక్కుల సంఘం జిల్లా చైర్మన్ రమేశ్, కుటుంబ సభ్యులు మృతదేహాన్ని చేతులతో పట్టుకుని వాగుదాటారు. మృతుడికి భార్య రాజుబాయి, కుమారులు మారు, జంగు ఉన్నారు.

గంజాయి మొక్కలు పట్టివేత


స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కలు

తాంసి: మండలంలోని గిరిగాం గ్రామంలో అక్రమంగా ఇంటి వద్ద పెంచుతున్న గంజాయి మొక్కలను ఎక్సైజ్ జిల్లా టాస్క్‌ఫోర్స్, ఎన్ ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. గ్రామానికి చెందిన తోడసం గోపాల్ ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలు పెంచుతున్నాడన్న సమాచారం మేరకు సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఇంటి ఆవరణలో పెంచుతున్న రెండు మొక్కలను గుర్తించారు. వీటి విలువ రూ.50 వేలు ఉంటుందని, స్వాధీనం చేసుకొని గోపాల్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ మురళీకృష్ణ తెలిపారు. దాడులలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ అక్బర్ హుస్సేన్, సిబ్బంది అరవింద్, మోహన్, రవీందర్, శారద, జమీర్, సతీశ్, పంచాయతీ కార్యదర్శి రవికిరణ్ ఉన్నారు.

ఇంట్లో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన కిరాణా వ్యాపారి తక్కెలపల్లి రాకేశ్ ఇంట్లో చోరీ జరిగింది. ఈనెల 19న కుటుంబ సభ్యులతో కలిసి ఆయన బంధువుల ఇంటికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి రాగా, ఇంటికి ఉన్న తాళం పగలగొట్టి ఉంది. బీరువాలో ఉన్న రూ.5వేల నగదు చోరీకి గురైనట్లు బాధితుడు ఆదివారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు.

పండుగల దృష్ట్యా ప్రత్యేక రైళ్లు

కాగజ్‌నగర్‌టౌన్: దసరా, దీపావళి పండుగల దృష్ట్యా ప్రయాణికుల రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున మూడు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రెయిన్ నం. 03253 పాట్నా- చర్లపల్లి, సోమ, బుధ వారాల్లో, అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు, ట్రెయిన్ నం. 07255 చర్లపల్లి -పాట్నా, వారానికి ఒక్క రోజు (బుధవారం), అక్టోబర్ 3 నుంచి జనవరి 1 వరకు, ట్రెయిన్ నం. 07256 చర్లపల్లి -పాట్నా, శుక్రవారం, అక్టోబర్ 3 నుంచి జనవరి 2 వరకు నడుస్తాయని, ఈ రైళ్లకు కాజీపేట్, పెద్దపల్లి, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్ స్టేషన్లలో హాల్టింగ్ ఉంటుందని తెలిపారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.

భక్తుల పాదయాత్ర


అమ్మవారి వద్ద జ్యోతి వెలిగిస్తున్న భక్తులు

బాసర: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఒక రోజు ముందుగానే మహారాష్ట్రలోని నాందేడ్, పర్బని, ఔరంగాబాద్, నాసిక్ జిల్లాలకు చెందిన భక్తులు పాదయాత్రగా వచ్చి ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. ఆలయ ముఖ్య అర్చకులు బాలకృష్ణ చేతుల మీదుగా అఖండజ్యోతిని వెలిగించుకుని బాసర నుంచి మహారాష్ట్రకు పాదయాత్రగా తరలివెళ్లారు. గత కొన్నేళ్లుగా జ్యోతితో పాదయాత్ర చేయడం ఆనవాయితీగా వస్తోందని భక్తుడు గణేశ్ తెలిపారు.

స్నూకర్ కేంద్రాలపై పోలీసుల దాడి

ఇంద్రవెల్లి: మండలకేంద్రంలో ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్న స్నూకర్ కేంద్రాలపై ఆదివారం రాత్రి ఎస్సై సాయన్న ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. మానిక్‌రావ్, రాజన్నలు నిర్వహిస్తున్న స్నూకర్ కేంద్రాల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి స్నూకర్ బాల్స్, పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై మాట్లాడుతూ అక్రమంగా స్నూకర్ కేంద్రాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గర్భిణి ఆత్మహత్యాయత్నం

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం పాత బెల్లంపల్లి గ్రామానికి చెందిన ఓ గర్భిణి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆదివారం సాయంత్రం గాజులవేణి శ్రావణి అనే గర్భిణి ఇంట్లో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకోగా కుటుంబ సభ్యులు హుటాహుటిన బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. శ్రావణి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉందని తాళ్లగురిజాల ఎస్సై రామకృష్ణ తెలిపారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్టు


అరెస్ట్ చూపుతున్న సీఐ సంజయ్

రెబ్బెన: కట్టుకున్న భార్యను అతి కిరాతకంగా భర్త గొడ్డలితో నరికి చంపిన ఘటన మండలంలోని నారాయణపూర్‌లో చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని సీఐ కార్యాలయంలో సీఐ సంజయ్ కేసు వివరాలు వెల్లడించారు. నారాయణపూర్‌కు చెందిన గజ్జల తిరుపతి టాటా ఏస్ వాహనం డ్రైవర్‌గా పని చేసేవాడు. అతనికి చిన్నబుదెకు చెందిన స్రవంతి(38)తో 21 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. గత కొంతకాలంగా మద్యానికి బానిసైన తిరుపతి తరుచూ భార్యతో గొడవపడేవాడు. అందులో భాగంగానే భార్యను ఎలాగైనా వదిలించుకోవాలని శనివారం తెల్లవారుజామున ఇంటి పనుల్లో నిమగ్నమైన స్రవంతిని గొడ్డలితో నరికి చంపి పరారయ్యాడు. మృతురాలి తమ్ముడు సంజయ్ అందించిన సమాచారం మేరకు ఏఎస్పీ చిత్తరంజన్, సీఐ సంజయ్, ఎస్సై వెంకటకృష్ణలు సంఘటన స్థలానికి చేరుకున్నారు. క్లూస్‌టీం ద్వారా శాస్త్రీయకోణంలో దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. భార్యను నరికి చంపి పోలీసులకు దొరకకుండా పారిపోవడానికి శనివారం రాత్రి రెబ్బెన రైల్వేస్టేషన్‌కు రాగా తిరుపతిని పట్టుకుని విచారించినట్లు సీఐ తెలిపారు. ఉద్దేశపూర్వకంగానే భార్యను నరికి చంపినట్లు అంగీకరించాడని, ఆదివారం జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఎస్సై వెంకట్‌కృష్ణ, సిబ్బంది సందీప్, దుర్గేందర్, ఎస్. శ్రీనివాస్, మహేశ్‌లు ఉన్నారు.

పిడుగుపాటుతో మహిళ మృతి


నిర్మల (ఫైల్)

సాత్నాల: భోరజ్ మండలంలోని పెండల్‌వాడ గ్రా మంలో ఆదివారం పిడుగు పడి నాగుల నిర్మల (33) అనే మహిళ మృత్యువాత పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం చేనుకు వెళ్లి పనులు ముగించుకుని సాయంత్రం తిరిగివస్తున్న సమయంలో పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలికి భర్త సంతోష్ ఉన్నాడు.

బండరేవు తండాలో ఆవు..
సారంగపూర్: మండలంలోని పొట్య గ్రామపంచాయతీ పరిధిలోని బండరేవు తండాలో పిడుగు పడి ఒక ఆవు మృతి చెందింది. బాధిత రైతు ఆడె క్రిష్ణ తెలిపిన వివరాల ప్రకారం ఎప్పటిలాగే పశువులను మేతకు సమీప అటవీ ప్రాంతానికి తరలించాడు. అయితే ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో పిడుగు పడి ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. మృతిచెందిన ఆవు విలువ సుమారు రూ.48వేల వరకు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

బూరుగుపల్లి (జి) తండాలో ఎద్దు..
నర్సాపూర్(జి): మండలంలోని బూరుగుపల్లి(జి) తండా గ్రామంలో పిడుగుపాటుకు ఎద్దు మృతి చెందిన సంఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు.. బూరుగుపల్లి (జి) తండా గ్రామానికి చెందిన జాదవ్ రవీందర్, జాదవ్ రాందాస్ అనే ఇద్దరు అన్నదమ్ములు పొలానికి వెళ్లి ఎడ్లబండిపై తిరిగి వస్తుండగా పిడుగుపాటుకు గురై ఒక ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.60వేలు ఉంటుందని వారు తెలిపారు. ఘటనలో రాందాస్ అనే వ్యక్తి స్పృహ తప్పి పడిపోయాడు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.


మృతిచెందిన ఆవు

గంగాపూర్ శివారులో గేదె..
రెబ్బెన: మండలంలోని గంగాపూర్ శివారులో ఆదివారం సాయంత్రం పిడుగుపాటుకు అదే గ్రామానికి చెందిన యాదగిరి శ్రీశైలంకు చెందిన గేదె మృతువాత పడింది. బాధితుడి కథనం ప్రకారం రోజు మాదిరిగానే యాదగిరి శ్రీశైలంకు సంబంధించిన బర్ల మంద గ్రామ శివారులో ఉన్న సమ్మక్కసారలమ్మ గద్దెల సమీపంలో మేత కోసం వెళ్లగా సాయంత్రం ఒక్కసారిగా పిడుగుపడి గేదె మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.30వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

దొంగల బీభత్సం..!


శారదా బేకరీని పరిశీలిస్తున్న ఎస్సై శ్రీనివాస్

బాసర: బాసరలో దొంగలు బీభత్సం సృష్టించారు. శనివారం అర్ధరాత్రి పట్టణంలోని ఓ బేకరీతో పాటు రెండిళ్లలో దొంగతనం చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బాసర బస్టాండ్ వద్ద ఉన్న శారదా బేకరీలో శనివారం అర్ధరాత్రి దొంగలు పడి షట్టర్ తాళాలు పగులగొట్టారు. లోపలికి చొరబడి నగదు ఎత్తుకెళ్లారు. ఉదయం యజమాని దశరథ్ దుకాణం తీసేందుకు రాగా తాళం పగలగొట్టినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై శ్రీనివాస్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దుకాణంలోని సీసీ కెమెరా, డీవీఆర్‌ను ధ్వంసం చేసినట్లు గుర్తించారు. పట్టణంలోని శారదనగర్, వెంకటేశ్వర కాలనీల్లోని రెండిళ్లలో తాళం వేసిన ఇండ్లలో చొరబడి విలువైన వస్తువులను, నగదు ఎత్తుకెళ్లారు. చోరీకి పాల్పడిన వారిని పట్టుకుంటామని ఎస్సై తెలిపారు.